క్లుప్తంగా

తూకాల్లో తేడాలొస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని వివిధ దుకాణాల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలం పెంచికలపాడులో బాషా జనరల్ స్టోర్‌లో రూ.20 విలువ చేసే వాటర్ బాటిల్‌ను రూ.25కు విక్రయించగా కేసు నమోదు చేశామన్నారు. కర్నూలు మార్కెట్‌యార్డు వద్ద ఇంటి వద్దకే బియ్యం పంపిణీ వాహనంలో కార్డుదారుల 20 కేజీల బియ్యం తూకం వేయగా 700 గ్రాములు తక్కువ రావడంతో కేసు నమోదు చేశామన్నారు. మండి బజార్‌లోని చిన్నమ్మవారిశాల పక్కన ఉన్న శ్రీసాయిరాం రైస్ షాపులోని బియ్యం సంచుల్లో 600 గ్రాములు బియ్యం తక్కువ ఉండడంతో జరిమానా విధించామన్నారు.

బాధిత కుటుంబానికి చెక్ పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు అసిస్టెంట్(సెక్యూరిటీ) కుమ్మరి రామకృష్ణ కుటుంబానికి రూ.2 లక్షల పరిహారాన్ని అందజేశారు. గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో రామకృష్ణ కుటుంబసభ్యులకు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెక్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న పాల్గొన్నారు.

హిప్నోసిస్‌తో మానసిక ఒత్తిళ్లకు పరిష్కారం



మాట్లాడుతున్న డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): హిప్నాటిజం ద్వారా చదువు, మానసిక ఒత్తిళ్లకు పరిష్కారం లభిస్తుందని హిప్నోథెరపిస్ట్ డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి తెలిపారు. ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కల్లూరులోని ఆదిత్య విద్యానిలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువు సమస్యలు, మానసిక సమస్యలను హిప్నోసిస్ ద్వారా ఏ విధంగా తొలగించవచ్చో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. కార్యక్రమంలో కేవీఆర్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ఆదిత్య విద్యానిలయం కరస్పాండెంట్ వాసుదేవయ్య, ఉపాధ్యాయులు మీనాక్షి, కవిత, ఫజియా, లాహిరి, ఎస్‌కే బాషా, రాజు పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంఈగా డాక్టర్ వెంకటరంగారెడ్డి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డిని పదోన్నతి వరించింది. ఆయనను అడిషనల్ డీఎంఈ కేడర్ కల్పిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ టి.కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయంలో వైద్యులు, ఉద్యోగులు కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ మాధవీశ్యామల, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ కార్మికులు రెండో రోజు సమ్మె చేపట్టారు. నోట్లో ఆకులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, టైమ్ స్కేల్‌వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

19వ రోజు మున్సిపల్ క్లాప్ డ్రైవర్ల సమ్మె

నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ విభాగంలో పని చేసే క్లాప్ డ్రైవర్ల సమ్మె గురువారం నాటికి 19 వ రోజుకు చేరుకుంది. నగరపాలక సంస్థ ఎదుట క్లాప్ డ్రైవర్లు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న క్లాప్ డ్రైవర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉచిత బస్సు ప్రయాణం వద్దు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించొద్దని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ కోరారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం ఆలోచన విరమించుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 8న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు.

విజ్ఞానం.. వినోదం

ఇది కదా అభివృద్ధి

- థీమ్ పార్కులతో కాలనీవాసులకు ఆహ్లాదం
- నగర వాసుల నుంచి మంచి స్పందన



19వ వార్డులో ఏర్పాటు చేసిన సైన్స్ థీమ్ పార్కు



పార్కులో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ జోన్‌లోని వివిధ ఆకృతులు

కర్నూలు (టౌన్): ఐదేళ్లు వెనక్కి వెళితే నగర పార్కులు అధ్వానంగా ఉండేవి. కనీసం ప్రహరీలు లేక పిచ్చి మొక్కలు మొలిచి, పందులు, కుక్కలకు అవాసంగా ఉండేవి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. రెండేళ్ల కరోనా తరువాత నగరంలో పార్కుల రూపురేఖలే మారిపోయాయి. వివిధ థీమ్‌లతో పార్కులను అభివృద్ధి చేశారు. ఒకప్పుడు ఆహ్లాదం కోసమే ఏర్పాటు చేసే పార్కులను ప్రస్తుతం విజ్ఞానాన్ని కూడా జోడించారు. అందులో భాగంగా మ్యాజిక్ పార్కు, సైన్స్ పార్కు, కల్చరల్ పార్కు, గ్లో గార్డెన్ తదితర పార్కుల ఏర్పాటుకు నగరపాలక యంత్రాంగం రూ.కోట్లు ఖర్చు చేసింది. మూడేళ్ల వ్యవధిలో రూ.10 కోట్లకు పైగా నిధులను వెచ్చించింది. కర్నూలు నగరంతో పాటు, పాణ్యం అర్బన్, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో ప్రజల కోసం, కుటుంబ సమేతంగా సేదతీరేందుకు పార్కులను అందంగా తీర్చిదిద్దారు.

సైన్స్ పార్కుకు రూ.2.27 కోట్లు..

నగర పాలక సంస్థ పరిధిలోని 19 వ వార్డు గఫూర్ నగర్‌లో నగరపాలక సంస్థ రూ.2.27 కోట్లు వెచ్చించి సైన్స్ పార్కును తీర్చిదిద్దింది. ఎక్కడా లేని విధంగా 1 ఎకరా స్థలంలో ఏర్పాటు చేసిన ఈ థీమ్ పార్కులో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. సైన్సు పరిజ్ఞానం పెంపొందించే విధంగా ఈ పార్కును తీర్చిదిద్దారు. పిల్లల కోసం మాథ్స్ జోన్, చిల్డ్రన్స్ జోన్, టైమ్ జోన్, అప్లైయిడ్ మెకానిక్స్ జోన్, టెక్నానిటీ కల్చర్, విశాలంగా గ్రీనరీ, మొక్కలు, బల్లలు, ప్రత్యేకంగా ప్లే గ్రౌండ్, సైక్లింగ్ వాకింగ్ ట్రాక్ వంటి సదుపాయాలు కల్పించడంతో నగర వాసులు కుటుంబసమేతంగా వచ్చి ఆనందాన్ని, విజ్ఞానాన్ని పొందుతున్నారు.



కుమారునికి టెలిస్కోప్‌ను చూపిస్తున్న తల్లి



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలతో ఎక్సర్‌సైజ్ చేస్తున్న దృశ్యం

వార్డు -19
జనాభా- 20 వేలు
పార్కు పేరు- సైన్స్ థీమ్ పార్కు
విస్తీర్ణం- 4 వేల 46 చదరపు మీటర్లు
పార్కు ఏర్పాటుకు రూ.1.87 కోట్లు
రోడ్ల కోసం రూ.10 లక్షలు
టాయ్‌లెట్ల ఏర్పాటుకు రూ.10 లక్షలు
కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.20 లక్షలు



సైన్స్ పార్కులో ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తల ప్రతిమలు

మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం

నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో ప్రజల కోసం ఆహ్లాదం పంచే విధంగా అనేక పార్కులను తీర్చిదిద్దాం. ఒక్కో పార్కుకు ఒక థీమ్‌ను ఎంచుకొని హైదరాబాదు, బెంగళూరు వంటి మహా నగరాల్లో ఉండే విధంగా పార్కులను అభివృద్ధి చేశారు. గఫూర్‌నగర్‌లో సైన్స్ పార్కును ఏర్పాటు చేశాం. చిన్నారులకు, విద్యార్థులకు సైన్సు ప్రాముఖ్యత, సైన్సులో పరిశోధనలు చేసిన ప్రముఖుల చిత్రాలు, ప్రతిమలు, పెయింటింగ్, గ్రీనరీ, చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేశాం. మంచి వాతావరణం ఉంది. పెద్దలు, మహిళలు సైతం ఆదరిస్తున్నారు. ఇలాంటి పార్కులను మరి కొన్నింటిని నిర్మించేందుకు చర్యలు చేపట్టాం.

– మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్

వీలైనప్పుడల్లా వస్తుంటాను

నేను నాన్ లోకల్. ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటున్నాను. ఇక్కడ పార్కు, వాతావరణం బాగుంది. వీలైనప్పుడల్లా పార్కుకు వస్తుంటాను. కొంత సేపు ఓపెన్ జిమ్‌లో ఎక్సర్ సైజ్‌లు చేస్తుంటాను. అలాగే ఎన్నో ఆట వస్తువులు ఉన్నాయి. సేదతీరేందుకు మంచి పార్కు ఇది. – కౌసల్య, ఇంటర్ విద్యార్థిని

అద్భుతంగా ఉంది

పార్కు చాలా బాగుంది. గతంలో పార్కులో కూర్చోవడానికి చెట్లు, బెంచీలు ఉండేవి. ఇప్పుడు పార్కులు భిన్నంగా ఉన్నాయి. మంచి వాతావరణం ఉంది. పిల్లలతో వస్తుంటాను. సైన్స్ పార్కు పేరుకు తగ్గట్టుగానే ఎన్నో పరికరాలు ఉన్నాయి. పిల్లలకు మంచి అవగాహన వస్తుంది. రెండు గంటలకు పైగా ఇక్కడే ఉంటాం. – మౌనిక, స్థానిక మహిళ

పిల్లలతో వస్తుంటాను

పిల్లలతో పార్కుకు వస్తుంటాను. పిల్లలు ఆడుకునేందుకు ప్లే జోన్ బాగుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరాలు ఎక్కడా చూడలేదు. అందరికి సౌకర్యవంతంగా ఉంది. గ్రీనరీతో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఉపయోగించుకుంటున్నాను. కొంతసేపు ఎక్సర్ సైజ్ చేయడం, వాకింగ్‌కు అనువుగా ఉంది. – రాజ్‌కుమార్, స్థానిక వాసి

వైకల్యం ఎదుగుదలకు అవరోధం కాదు

- నగర మేయర్ బీవై రామయ్య



బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, డీఈఓ తదితరులు

కర్నూలు (అర్బన్): అంగవైకల్యం మనిషి ఎదుగుదలకు అవరోధం కాదని, వాటి గురించి నిరాశతో కుంగిపోవాల్సిన అవసరం లేదని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతిని బి.క్యాంప్‌లోని అంధుల సమాఖ్య నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, డీఈఓ రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు తదితర వాటిని అందిస్తోందన్నారు. అనంతరం బ్రెయిలీ క్యాలెండర్- 2024 ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు హృదయరాజు, ఎస్.పుష్పరాజు, బి.అనిల్ కుమార్, ఆర్.విశ్వనాథ్‌రెడ్డి, రాఘవయ్య, కె.సుబ్రహ్మణ్యం, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జెమ్మిచెట్టు సమీపంలో ఉన్న తమ ఆస్తిని పక్కనే నివాసం ఉన్న మహ్మద్‌బాషా తన కూతురు అఖిలాబీబీకి దాన విక్రయం చేశారని, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్ నంబర్ 1968/2023ని రద్దు చేయాలని బాధితుడు మహ్మద్ ఉజైర్ కోరారు. గురువారం బాధితుడు కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని న్యాయం చేయాలని జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావును అభ్యర్థించారు. అనంతరం బాధితుడు విలేకరులతో మాట్లాడుతూ తనకు పాతబస్తీలోని ఇంటి నంబర్ 26/179-180లో 8 సెంట్ల స్థలం ఉందన్నారు. దీనిని తమ తాత మహ్మద్ ఇబ్రహీం సాహెబ్ వేలం పాడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. తరువాత ఆ ఆస్తిని తమ తండ్రి ఎం.అబ్దుల్ వహీద్‌కు వచ్చిందన్నారు. ప్రస్తుతం ఆ ఆస్తిని తమ నలుగురు అన్నదమ్ముల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొని రెవెన్యూ రికార్డుల్లోనూ మార్పులు చేయించుకున్నామన్నారు. అయితే 2023 జూలై 7న తమ ఇంటి పక్కన ఉన్న మహ్మద్ బాషా తన కూతురు అఖిలాబీబీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అప్పటి సబ్‌రిజిస్ట్రార్ చైతన్య రాయలు ఎలాంటి లింక్ డాక్యుమెంట్లను చూడకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారన్నారు. విషయం తెలుసుకుని అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలని ఇంతకు ముందే జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేసి, డాక్యుమెంట్‌ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని ఆయన అభ్యర్థించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. గురువారం పాతబస్తీలోని హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, స్కూళ్ల ఆధునీకరణ, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఆయన వెంట వార్డు నాయకులు శేషు యాదవ్, కార్పొరేటర్లు పాషావలీ, షేక్‌మూద్ ఉన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షల మోడరేషన్ కమిటీ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): 2022-23 సంవత్సర బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల రికార్డుల పరిశీలన కోసం ప్రభుత్వ బీఈడీ కళాశాల(ఐఏఎస్‌ఈ) అధ్యాపకులు డాక్టర్ జి.నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆర్‌యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌యూ పరిధిలోని బీఈడీ కాలేజీలు ఈనెల 6వ తేదీలోపు సమన్వయ కమిటీలోని సభ్యులతో విద్యార్థులు రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

గర్భిణీ కిట్ పరీక్షలు నిర్వహించాలి


కర్నూలు(హాస్పిటల్): ఆశా కార్యకర్తలు తమ దిన చర్యలో భాగంగా అర్హులైన దంపతులను సందర్శించి అవసరమైన వారికి గర్భిణీ కిట్ పరీక్ష నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం గార్గేయపురంలో ఆశా సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జయలక్ష్మి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

7న పుస్తకావిష్కరణ

కర్నూలు(సెంట్రల్): తెలుగుభాష వికాసోద్యమ కార్యదర్శి జేఎస్‌ఆర్‌కే శర్మ రచించిన దేశం కోసం ద్వితీయ ముద్రణ పుస్తకాన్ని ఈనెల 7న భరతమాతగుడిలో ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా శతావధాని, ప్రసిద్ధ పండితులు బ్రహ్మశ్రీ గంగ్గారి దత్తాత్రేయ శర్మ వ్యవహరించనున్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటండి

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



స్టేడియంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు (టౌన్): క్రీడల్లో ప్రతిభ చాటాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ స్థాయిలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం ఎంపీపీ వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు.

విజేతల వివరాలు..

- పురుషుల బాడ్మింటన్: తిమోతి రాజు జట్టు 15-13, 15-08 స్కోరుతో భీముడు జట్టుపై విజయం సాధించింది.
- మహిళల ఖోఖో: భాగ్య జట్టు 04-01 స్కోరుతో విజయలక్ష్మి జట్టుపై గెలుపొందింది.
- రేవంత్, నౌషద్ జంట 30-24 స్కోరుతో అఫ్రోజ్ ఖాన్, నితిన్ కుమార్ జంటపై గెలిచారు.
- మహిళల విభాగం: షరీన్, చేతన జంట 30-04 స్కోరుతో సువర్ణ, సృజనపై గెలుపొందారు.
- పురుషుల కబడ్డీ: అఫ్రోజ్ ఖాన్ జట్టు 24-13 పాయింట్ల తేడాతో రవికుమార్ జట్టుపై గెలుపొందారు.
- పురుషుల ఖోఖో: బండారు రాజు జట్టు 6-4 పాయింట్ల తేడాతో నితిన్ రాజు జట్టుపై గెలిచారు.
- బీక్యాంప్ క్రీడా మైదానంలో జరిగిన పురుషుల బాడ్మింటన్ పోటీల్లో శేషయ్య ఆచారి, బాలపెద్దయ్య జంట 30-25 స్కోరుతో అభిషేక్, విశాల్ జంటపై గెలిచారు. ఎ.క్యాంప్ మైపర్ క్రీడా మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పవన్‌కుమార్ జట్టు 25-19 స్కోరుతో రవిశంకర్ జట్టుపై గెలిచారు.

బొజ్జా అరెస్టు తగదు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని కోరుతూ వివిధ రూపాల్లో ఆందోళన చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టు తగదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. పాత కేసులో ఆయన్ను అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

నోటీసు ప్రతుల దహనం

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 5 నుంచి విధులకు హాజరు కావాలని ప్రభుత్వం ఇచ్చిన నోటీసు ప్రతులను అంగన్‌వాడీలు సమ్మె శిబిరంలో దహనం చేశారు. గురువారంతో అంగన్‌వాడీల సమ్మె 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వారు కోరుతున్నట్లు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సాయిబాబా పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన పరీక్షలకు 8,090 మంది విద్యార్థులకు గానూ 7,309 మంది హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా పరీక్షలు జరుగుతున్నాయి.

సేఫ్ కస్టడీ ఆర్టికల్లను ధ్వంసం చేయండి

- జేసీ నారపురెడ్డి మౌర్య



స్ట్రాంగ్‌రూమ్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న జేసీ

కర్నూలు(సెంట్రల్): ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌ల్లో మూడేళ్లకు పైబడి ఉన్న పరీక్షా పత్రాలు, దేవదాయ శాఖ వస్తువులు, బ్యాలెట్ పేపర్లు, ఖజానా శాఖ చెక్‌బుక్‌లు ధ్వంసం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె ట్రెజరీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఆర్వో, ఏసీబీ అదనపు ఎస్పీ, ఖజానా శాఖ అధికారి సమన్వయంతో మూడేళ్లకు పైబడిన వస్తువుల జాబితాను తయారు చేసి ఈనెల 21వ తేదీలోపు ధ్వంసం చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను జేసీతోపాటు కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.సర్కార్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఏటీఓ జయలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు, ఉపాధి కల్పన అధికారి దీప్తి, డీఈఓ రంగారెడ్డి, ఎస్టీఓ కరుణాకర్, సునీల్ పాల్గొన్నారు.

టీడీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: సంక్షేమ పథకాలపై టీడీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కార్యకర్తలకు సూచించారు. గురువారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలలో 98 శాతం అమలు చేశామన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికి వెళ్లి వివరించామన్నారు. ఈక్రమంలో వేల కుటుంబాలను నేరుగా కలుసుకునే భాగ్యం దక్కిందన్నారు. కోడుమూరు వైఎస్సార్‌సీపీకి అడ్డా అని, తనకే మరోసారి అవకాశం రానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబు 2014లో ఇచ్చిన 600 హామీలను అమలు చేయలేకపోయారన్నారు. ఉనికిని చాటుకునేందుకే జగనన్న అమలు చేస్తున్న పథకాలపై టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.2.97 కోట్లతో బళ్లారి రోడ్డు నుంచి క్రిష్టాపురం వరకు బీటీ రోడ్డు, రూ.4.50 కోట్లతో వర్కూరు నుంచి మెరుగుదొడ్డి గ్రామం వరకు రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. రూ.32 కోట్లతో కొత్తకోట నుంచి తిమ్మాపురం వరకు పనులు పూర్తి కావాల్సి ఉందని, త్వరలోనే కోడుమూరు నుంచి గూడూరు రోడ్డు, కర్నూలు మండలంలోని పూడూరు రోడ్డుకు పది రోజుల్లో పనులు మొదలుకానున్నాయని తెలిపిరు. ప్రతి పల్లెలో సచివాలయం ఏర్పాటు చేశామని, స్కూళ్ల రూపురేఖలు మార్చామని, పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువులు అందిస్తున్నాని చెప్పారు. పవన్‌కల్యాణ్ పార్టీ రెండు జిల్లాలకు మాత్రమే పరిమితమైందన్నారు. జగన్ మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



బస్సు యాత్రలో భాగంగా ప్రజాప్రతినిధులకు అభివాదం చేస్తున్న స్థానికులు



ప్రజాప్రతినిధులకు క్రేన్ సాయంతో తెచ్చిన గజమాల



వైఎస్సార్‌సీపీ రంగుల బెలూన్లను వదులుతున్న కార్యకర్తలు



మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బస్సుయాత్రకు బ్రహ్మరథం

బడుగు, బలహీన వర్గాలను ఆత్మీయంగా పలకరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు గురువారం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న కేఎస్‌ఆర్ కన్వెన్షన్ నుంచి కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్ వరకు సాగిన బస్సు యాత్రలో ప్రజలు భారీగా పాల్గొని మద్దతు పలికారు. జగనన్న ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమని నినదించారు. మరోసారి జగనన్నను గెలిపించుకుందామని ముక్తకంఠంతో చెప్పారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు



హైవేపై ఎక్కి బహిరంగ సభను వీక్షిస్తున్న ప్రజలు



పాణ్యం ఎమ్మెల్యే కాటసానిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



చెన్నమ్మ సర్కిల్‌లో నాయకుల ప్రసంగాన్ని వింటూ కేరింతలు కొడుతున్న కార్యకర్తలు



సభావేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు